# ప్రమీలోపాఖ్యానం : :

రచన;
మిత్రశ్రీ

(గతసంచిక తరువాయి)

ప్రభావతి కాగితం విప్పి చదువుదా మనుకుంది అయితే ఆమె మనసు బాగా లేదు. వెంటనే కిటికీ తలుపులు మూసేసింది. కాని ఆమెలోని బలహీనత ఆమె నిశ్చయాన్ని మార్చేసింది. '|నీ అందం వెర్రివాణ్ని చేస్తోంది. మీ పనిమనిషి ద్వారా తెలియజేస్తే రాత్రికి వస్తాను' ప్రభావతి నవ్వుకుంది. ఇంతవరకూ తననెవరూ అడిగి రాలేదు. వచ్చిన వాళ్ళను తను పొమ్మన లేదు. ఈ కుర్రాడు వ్రాత తీరుచూస్తే వట్టి భయస్తుడులాగున్నాడు. తను వేశ్యగా జీవిస్తానని తెలిసీ కూడా ఇలా వ్రాయటం బట్టి చూస్తే ఇలాంటి వ్యవహారాల్లో అనుభవంలేని వాడిలాగున్నాడు. ప్రభావతి ఆలోచించింది. చివరికి పనిమనిషిని పిలిచి ప్రక్కింటి అబ్బాయిని రాత్రి 10 గంటలకు రమ్మని చెప్పి పంపింది,

మధ్యాహ్నం ప్రభావతి తిరిగి ప్రమీలాగా మారి ఆలోచించ సాగింది. వాడు తనకు యిచ్చిన, డబ్బు తీసుకోటానికే నిశ్చయించింది. వెంటనే ప్రయాణానికి సిద్ధమయింది. ఆ సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌లోనే ప్రమీల విశాఖపట్నానికి బయల్దేరి వెళ్ళి పోయింది.

* * *

నాలుగో రోజు ఉదయం ఎక్స్‌ప్రెస్‌లో వచ్చేసింది ప్రమీల. ప్రయాణపు బడలిక వల్ల యింటికి రాగానే నిద్ర పోయింది. సాయంత్రం 4 గంటలకు నిద్రలేచి స్నానంచేసి, భోజనంచేసి టాయ్‌లెటింగ్‌కు కూర్చుంది. పనిమనిషితో ప్రక్కింటి అబ్బాయికి తిరిగి కబురంపింది.

రాత్రి 10 గంటలకు ప్రక్కింటి రాంబాబు నటుగా ముస్తాబై వచ్చేడు. ప్రభావతి రాంబాబును లాలనగా ఆహ్వానించి మంచం మీద కూర్చోబెట్టింది. ఫ్లాస్కులో పోసి వుంచిన ఓవల్‌టిన్ గ్లాసులో పోసుకొచ్చి రాంబాబుకు అందించింది. రాంబాబు త్రాగేశాడు. గ్లాసు లోపల బెట్టి వచ్చిన ప్రభావతిని మంచంమీదకు లాగి గాఢంగా కౌగలించుకున్నాడు. ప్రభావతి ఒక చేతిని బయటకు తీసుకొని మంచానికి సమీపంగా గోడకున్న రెండు మీటలు నొక్కటంతో పెద్ద లైటు ఆరిపోయి బెడ్ లైటు వెలిగింది. ఇప్పుడు ప్రభావతి బాహువుల మధ్య రాంబాబు ఉక్కిరి బిక్కిరై పోక తప్పింది కాదు. నూతనానుభవం పొందిన రాంబాబు అలసి నిద్రపోయేడు.

* * *

ఉదయం 9 గంటలయినా ఆ ఇంటి తలుపులు తెరువబడనే లేదు. ఇంతలో ప్రభావతి ప్రియుడైన రెడ్డి వచ్చేడు. ఎన్నిసార్లు పిలిచినా పలుకక పోవటంతో తలుపు మీద కోపంతో తన్నేడు. తలుపులు బార్లా తెరుచుకున్నాయి. విసురుగా పడక గదిని ప్రవేశించిన రెడ్డి తపీమని ఆగిపోయేడు. గుడ్లప్పగించి చూడసాగేడు. తక్షణం బయటకు వెళ్ళిపోయేడు. మరొక 10 నిముషాలకు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబిల్సుతో సహా రెడ్డి హాజరయ్యేడు.

మంచం మీద రాంబాబు వెల్లకిలా పడివున్నాడు. అతని గుండెలోకి బాకు దించబడి వుంది. శరీరమంతా రక్తంతో తడిసిపోయి వుంది. మంచం ప్రక్కనే నేల మీద ప్రభావతి వెల్లకిలా పడి వుంది. సబినస్పెక్టర్ ప్రభావతి నాడిని చూచేడు. 'ఉహూః! లాభం లేదు. ఈమె కూడా చనిపోయింది. ఏయ్! ఫోర్‌ట్వెంటీ పంచాయతినీ మాకు ఏర్పాటు చెయ్యి' అంటూ సబినస్పెక్టర్ గదిని శోధించ సాగేడు. గదిలో మూలగా వున్న ఒక చిన్న బల్లమీద ఒక ఉత్తరం దొరికింది. దానిమీద 'మేజిస్ట్రేటుగారికి' అని వుంది. సబినస్పెక్టర్ మడత విప్పి చదువ సాగేడు.

'నాకు తల్లి దండ్రులు పెట్టిన పేరు చెన్నమ్మ. నా చిన్నతనంలోనే తల్లి చనిపోవటంతో మా నాన్న మరో పెళ్ళి చేసుకొన్నాడు. మా అక్క రాజ్యం పెళ్ళయి

అత్తారింటికి వెళ్ళి పోవటంతో మాసవితి తల్లి క్రోధానికి నేనొక్కతెనే గురి కావల్సి వచ్చింది. నా ఆరవ ఏట నా సవతి తల్లికి కొడుకు పుట్టేడు. అప్పటినుంచి నాకు కష్టాలు మరీ ఎక్కువయ్యేయి. ఒకసారి మా అక్క నన్ను చూడటానికివచ్చి నాకష్టాలు విని తనతో తీసుకెళ్ళి పోయింది. మా బావ శివరావు పెద్దాపురంలో వకీలు. నేను స్కూలుకెళ్లి చదువుకొన సాగించ నారంభించేను. మా బావదగ్గర అప్రెంటిస్ గా పని చేస్తున్న లోకనాథంతో నా 14 వ ఏట నాడు వివాహమయ్యింది. అంతటిలో నా చదువు 4 వ ఫారం ఆగిపోయింది. మేము కూడా అక్కా బావలతోపాటే వుంటున్నాం. రెండేళ్ళు సుఖంగా జీవనం సాగి పోయింది. మావారు తన ప్రాక్టీసును విశాఖపట్నంలో ప్రారంభించటానిక్క ప్రయాణ మయ్యేరు. విశాఖపట్నంలో మా యింటి ప్రక్కనే వున్న వాసుదేవరావుగారితో మావారికి చాలా స్నేహం. విశాఖపట్నం చేరిన ఆరు నెలలకే ఒకవాడు హఠాత్తుగా మావారు గుండె జబ్బుతో చనిపోయేరు. అంతకు ముందే వాసుదేవరావుగారికి లొంగి పోయిన నేను ఆయనతోనే వుండిపోతాననే సరికి మా అక్కా, బావ నన్ను అసహ్యించుకొని వెళ్ళిపోయేరు. వాసుదేవరావుగారికి బాగా ఆస్థి వుంది. ఉద్యోగం సద్యోగం లేదు. మా జీవితం హాయిగా సాగి పోయింది. నేను ఏది కోరితే అది నా ముందు ప్రత్యక్షమయ్యేది. భోగలాలస జీవనం అలవాటయింది. నేను విలాసినిగా తయారయ్యేను. వారు నాకు ప్రమిలాదేవి అని పేరు పెట్టేరు. నాటినుంచి ప్రమిలాగా చెలామణి అయ్యేను. మా విలాస జీవితానికి ఆస్థితరుగుతున్నా వారు లెక్క చెయ్యలేదు. పది సంవత్సరాల కాలం సుఖంగా జరిగి పోయింది. వారూ, నేనూ, హంపీ చూడాలని వెళ్లేం. తుంగభద్ర ఆనకట్టు ప్రాంతంలో వున్న ఇంద్ర భవనంలో హంపీనుంచి తిరిగి వచ్చి మకాం వేశేం. ఆ ఇంద్ర భవనమే నా జీవితాన్ని నాశనం చేసిందనాలి. వారు వారి స్నేహితుని కోసం బళ్ళారి వెళ్ళేరు. వారి స్నేహితుడు రాజు యిటు ఇంద్రభవానికి వచ్చేడు. ఆ రాత్రికి వారు రాలేదు. నాటి రాత్రి నాలోని బలహీనతవల్ల రాజుకు లొంగి పోయేను. వారు బళ్లారిలో జైలు శిక్ష పొందేరు, రాజుతో నేను కొత్తపేటకు వెళ్ళి పోయేను. రెండేళ్లు సుఖంగా వున్నాను. రాజుతో వాగ్వాదం జరిగి ఆ యింటినుంచి బయటికి వచ్చేశేను. బంధువులచు కనబడకూడదనుకున్నాను. ధైర్యంగా యిక్కడికి చేరుకున్నాను. అనాధల కందరికీ సులభ జీవనోపాయమైన వ్యభిచారం వృత్తిగా చేసుకున్నాను. సంవత్సర కాలంలో బాగా డబ్బు సంపాదించేను. ఇంతలో జీవితానికీ మరొక పరీక్ష వచ్చింది. మదనపల్లె శానిటోరియంలో చనిపోయిన వాసుదేవరావుగారు తన పేర వున్న నలభై వేల రూపాయలు నాకు చెందాలని వీలునామా వ్రాసి చనిపోయేరు. ఆంధ్ర బ్యాంకివారి కరపత్రం తెచ్చిన మునిరెడ్డిగారికి నా కృతజ్ఞత. మా ప్రక్కింటి అబ్బాయి రాంబాబు నన్ను ఆశించేడు. ఇంతలోనే కరపత్రం చూచిన నేను విశాఖపట్నం వెళ్ళేను. బ్యాంకిలో డబ్బును నా పేర మార్పించుకున్నాను. విశాఖపట్నంలోనే వుండిపోవాలనుకున్నాను. కాని నాలోని బలహీనత నన్ను ప్రక్కింటి అబ్బాయి వైపు లాగింది. ఒక్క రోజయినా అతనివల్ల సౌఖ్యం పొందాలన్న తృష్ణ ఎక్కువయ్యింది. ఆ రోజుననే ఒక వీలునామా రిజిష్టరు చేయించి బ్యాంకిలో డిపాజిట్టు చేశేను. పా సవితి తమ్ముడు కర్నూలులోనే వుద్యోగం చేస్తున్నాడని తెలిసింది; నా పేరిట వున్న డబ్బును సవితి తమ్ముడు రామబ్రహ్మం పేరట జమకట్టి పయనమయ్యేను. నిన్ననే వచ్చేను. రాత్రికి రమ్మని ప్రక్కింటి అబ్బాయికి కబురంపేను. రాత్రి 10 గంటలకు వచ్చేడు. రాత్రి ఒంటి గంట ప్రాంతానికి రాంబాబు ఒళ్లు మరచి నిద్రపోతున్నాడు. కట్టుకున్న అడ్డ పంచ కొంచెం తొలగి పోయి వుంది. అతని ఎడమ తొడమీద అంగుళం వెడల్పున వున్న నల్లటి పుట్టు మచ్చను చూసి ఆశ్చర్యపడ్డాను. అతని లాల్చీ జేబులోని పర్సు తీసేను. పర్సులో ఒక ఇన్లాండ్ కవరుంది. విప్పి చదివేను. నేల కదులుతున్నట్లనిపించింది. తల తిరిగి పోయింది. ప్రక్క గదిలోకి వచ్చేశేను. ఏ సవతి తమ్ముని పేర నా ఆస్థినంతా వీలునామా వ్రాసేనో ఆ సవితి తమ్ముడే ఈ బాబు కావటం, ప్రకృతి విరుద్ధమయిన మా కలయిక, నన్ను కలవరపరచేయి. ఇటువంటి చరిత్ర హీనులంభూమికి భారమనిపించింది. వెంటనే ధైర్యంగా నా ఆత్మ రక్షణకోసం వుంచుకొన్న బాకుతో రాంబాబును పొడి చేశేను. ఒక్క సారి మూల్గి శాస్వతంగా కన్ను మూశేడు. బాకుతో నన్ను నేను పొడుచుకొనే ధైర్యం చాలక నీళ్ళలో విషం కలుపుకొని త్రాగేశేను. విషం త్రాగే ముందు యీ వుత్తరం వ్రాసేను. ఈ వుత్తరం ప్రజల కంట పడేసరికి నా జీవితం ఆఖరవుతుంది. బ్యాంకులోని డబ్బు ప్రధాన జాతీయ నిధికి చెందాలని నా అభిలాష

—యిట్లు, ప్రభావతి అనే ప్రమీలాదేవి.